క్లుప్తంగా

అమిత్‌షా సభకు తరలిన బీజేపీ నేతలు

కూకట్‌పల్లి: ఖమ్మంలో జరగనున్న కేంద్ర మంత్రి అమిత్‌షా భారీ బహిరంగ సభకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని మేడ్చల్–మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పట్లోళ్ల సాయినాథ్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్‌ఎస్ కుటుంబ పాలనను అంతం చేయడానికి, కేసీఆర్ గడీలను బద్దలు కొట్టడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేస్తున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రం సర్వ నాశనం అయిందని ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన గౌరవం రాష్ట్ర ప్రజలు, యువతకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో బీజేపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

రాంచందర్‌గౌడ్ పార్థివదేహానికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తండ్రి రాంచందర్‌గౌడ్ స్వర్గస్తులయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీలు మంగళవారం రాంచందర్‌గౌడ్ పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

17న స్పాట్ అడ్మిషన్‌లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తెలంగాణ మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఖాళీల కోసం ఈ నెల 17వ తేదీన స్పాట్ అడ్మిషన్‌లను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రాంప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్‌ల ప్రక్రియ ప్రారంభించే ముందు గ్రూపుల వారీగా ఖాళీలను ప్రకటిస్తామని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ ఈనెల 17వ తేదీన ఉదయం 10.30 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. స్పాట్ అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు. 17న హాజరయ్యే విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ కోసం మాత్రమే పరిగణించబడతారని తెలిపారు.

16న జాబ్ మేళా

గచ్చిబౌలి: నిరుద్యోగ యువత కోసం జీహెచ్ఎంసీ సహకారంతో లైట్‌హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్ జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చందానగర్‌లోని ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న లైట్ హౌస్ స్కిల్లింగ్ సెంటర్‌లో 16న ఉదయం 11 గంటలకు జాబ్ మేళ ప్రారంభమవుతుందన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్హతలున్న వారు హాజరుకావచ్చు. అభ్యర్థులు ఆధార్‌కార్డులు, రెజ్యూమ్‌లు 3 సెట్‌లు తీసుకురావాలని కోరారు. వివరాలకు ఫోన్ నం.86881 00660.

వినియోగదారుడిపై పెట్రోల్ బంక్ సిబ్బంది దాడి

భాగ్యనగర్‌కాలనీ: పెట్రోల్ కోసం వచ్చిన వినియోగదారుడిపై బంక్ సిబ్బంది దాడి చేసిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన తేజ అతని స్నేహితుడి జన్మదిన వేడుకల్లో పాల్గొని తిరిగి వెళ్తుండగా స్నేహితుడి ద్విచక్ర వాహనంలో పెట్రోల్ అయిపోవడంతో సుమిత్రనగర్‌లోని హెచ్‌పీ బంక్‌లో పెట్రోల్ పోయించుకోవడం కోసం బంక్‌కు వెళ్లారు. బాటిల్‌లో పెట్రోల్ కొట్టించుకున్న సమయంలో కల్తీ పెట్రోల్ అని ప్రశ్నించారు. ఈ క్రమంలో బంక్ సిబ్బందితో వాగ్వాదం జరిగింది. బంక్‌లో పనిచేస్తున్న బిహార్‌కు బిట్టు కత్తి తీసుకొచ్చి వినియోగదారుడుపై దాడి చేశాడు. ఈ ఘటనలో తేజాకు స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో తేజ స్నేహితులు బిట్టుపై దాడి చేయటంతో తలకు గాయమైంది. ఇరువురు కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

బాలానగర్: కిరాణా షాపుకు వెళ్తొస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన ఓ బాలిక అదృశ్యమైన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె. భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీను, ఎల్లమ్మ దంపతుల కుమార్తె (17) పెరుగు ప్యాకెట్ కోసం బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు ప్రత్యేక భవనం నిర్మిస్తాం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- మహిళలకు ప్రత్యేక పార్కుల నిర్మాణం కూకట్‌పల్లి నుంచే మొదలు
- బీఆర్‌ఎస్ పాలనలో మహిళలకు అనేక సంక్షేమ పథకాలు




దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉత్తమ మహిళలను సన్మానించిన అనంతరం ఎమ్మెల్యే మాధవరం

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మంగళవారం కూకట్‌పల్లిలోని ఎస్‌కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో జరిగిన తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అందించి వారికి పెద్ద అన్నలా నిలిచారన్నారు. ముఖ్యంగా ఇంటింటికి మంచినీరు అందించి వారి మంచినీటి కష్టాలు తీర్చారని తెలిపారు. ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి కేసీఆర్ కిట్‌తో మొదలు పెట్టి గురుకుల విద్యాలయాల ద్వారా విద్య, ఆడపిల్ల పెళ్లికి 1లక్ష 116 రూపాయలు అందించి వారికి అండగా నిలిచిన గొప్ప నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు.

◆ కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఇప్పటికే 15 వేల మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అందించామన్నారు. మహిళలకు కోసం ప్రత్యేకంగా భవనం నిర్మించేందుకు కైత్లాపూర్ వద్ద స్థలం కేటాయించామని తెలిపారు. అక్కడ త్వరలో భవనం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా మహిళల రక్షణ కోసం సీఎం కేసీఆర్ అనేక చర్యలు తీసుకున్నారని తెలిపారు. మహిళలకు అన్యాయం జరిగితే ఎలాంటి పరిణామాలు ఉంటున్నాయో మీరే చేస్తున్నారని అన్నారు.

◆ మహిళలకు వృత్తి విద్యలో శిక్షణ ఇప్పించి వారికి సర్టిఫికెట్ అందించి వారు ఎదిగేందుకు సహాయ సహకారాలు అందజేయడానికి కూకట్‌పల్లి నియోజకవర్గంలో తన వంతు కృషి చేస్తున్నానని అన్నారు. ఆగస్టు నెలలో 1000 మందికి కుట్టు మెషిన్లు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారి ప్రత్యేకంగా మహిళల కోసం పార్కులను నిర్మించటం కూకట్‌పల్లి నుంచే ఆరంభమైందన్నారు. కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు సన్మానం చేసి మెమొంటో అందించారు. కార్యక్రమంలో డీసీలు రవికుమార్, రవీంద్ర కుమార్, మహిళా అధికారులు పాల్గొన్నారు.

గ్రేటర్‌కే తలమానికంగా కూకట్‌పల్లి

నియోజకవర్గంలో 98 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశాం


ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ ముద్దం

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజా సంక్షేమమే నా జీవితం ... కూకట్‌పల్లి అభివృద్ధే నా ధ్యేయమని ప్రజల ఆదరాభిమానాలు ఉన్నంతా కాలం ప్రజా సేవకే నా జీవితం అంకితమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో రూ.2.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులకు కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, అధికారులతో కలసి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హస్మత్‌పేట బోయిన్ చెరువుకు రిటర్నింగ్ వాల్‌కు మరో రూ.3కోట్ల నిధులు ఇచ్చామని పూర్తయిన వెంటనే మహిళలు, పురుషులకు ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో 98 శాతం అభివృద్ధి పనులను పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈ బాలకృష్ణ, ఏఈ అరవింద్ మాజీ కౌన్సిలర్లు మక్కాల నర్సింగ్‌రావు, కర్రె లావణ్య నాయకులు నరేందర్‌గౌడ్, కర్రె జంగయ్య, సయ్యద్ ఏజాజ్, బల్వంత్‌రెడ్డి, గడ్డం నర్సింగ్‌రావు, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సోలార్ సౌకర్యం

- ప్రణాళికలు సిద్ధం చేశాం
- విద్యార్థులకు కిట్లు (బ్యాగ్, పుస్తకాలు, పెన్నులు) అందజేస్తాం


సమీక్షా సమావేశంలో ప్రధాన ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎంఈఓ ఆంజనేయులుతో కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా పాఠశాల అభివృద్ధి రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలపై చర్చించారు. గతేడాది ఎమ్మెల్యే నిధులతో బ్యాగులు, పెన్నులు, పుస్తకాలతో కూడిన కిట్లను అందించిన విషయం తెలిసిందే. అదే విధంగా ఈ సంవత్సరం కూడా విద్యార్థులకు బ్యాగు కిట్లను అందజేస్తామని తెలిపారు.

◆ అదే విధంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు ఎక్కడైనా ఇబ్బంది ఉంటే వెంటనే నిధులు మంజూరు చేస్తామన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. అదే విధంగా నూతన పాఠశాలల నిర్మాణానికి కావాల్సిన ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. అన్ని పాఠశాలలకు సోలార్ సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే బోయినపల్లిలో ప్రయోగాత్మకంగా అమలు చేశామని గుర్తు చేశారు.

◆ ప్రభుత్వ పాఠశాలల్లో 10/10 సాధించిన వారికి ట్యాబ్‌లు అందిస్తామని తెలిపారు. ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలకు కూడా విద్యా ప్రమాణాలు పాటిస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపి వారి ఉన్నతికి కృషి చేయాలని కోరారు. ఇప్పటికే కేపీహెచ్‌బీలోని రెండున్నర ఎకరాల్లో ఎన్‌టీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. బాలాజీనగర్ డివిజన్‌లో కూడా నూతన పాఠశాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

కొంపల్లి విద్యార్థుల ప్రతిభ



5వ ఫెడరేషన్ బ్యాండి అసోసియేషన్ గోవాలో జరిగిన అండర్–17 స్కేటింగ్, హాకీ పోటీల్లో కొంపల్లికి చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు. కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో కీర్తి ప్రతిష్టలు తీసుకొస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు, పెద్దలకు కూడా ఆడుకోవడానికి నియోజకవర్గంలో ఎక్కడికక్కడ క్రీడా మైదానాలు, ఇండోర్ స్టేడియాలు, షటిల్ కోర్టులు, పార్కులు నిర్మించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో విజేతలు మణికంత, ప్రభాస్ వర్మ, జతిన్, విశాల్, ఆది తనిష్, సాయి సిద్ధార్థ రెడ్డి, విశ్వ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ డాక్టర్ సెల్ చైర్మన్‌గా విశ్వతేజేశ్వర్‌రావు


విశ్వతేజేశ్వర్‌రావుకు బాధ్యతలు అప్పగిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

కూకట్‌పల్లి: టీపీసీసీ స్టేట్ డాక్టర్ సెల్ చైర్మన్‌గా గొట్టిముక్కల విశ్వతేజేశ్వర్‌రావు నియమితులైన విషయం తెలిసిందే. మంగళవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేతులు మీదుగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

విశ్వ తేజేశ్వరరావుకు శుభాకాంక్షలు...

కూకట్‌పల్లి: టీపీసీసీ స్టేట్ డాక్టర్ సెల్ చైర్మన్ గొట్టిముక్కల విశ్వ తేజేశ్వరరావును మంగళవారం బండారి ప్రవీణ్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంగళరావు, ఎన్ఎస్‌యూఐ స్టేట్ జనరల్ సెక్రటరీ సయిద్ మిస్బా, సమీ, అస్లం, శివప్రసాద్, మహేష్‌గౌడ్, శ్రీనివాస్ తదిరులు పాల్గొన్నారు.

మన దేశానికి అందం మన సాంప్రదాయాలే

బనారస్ హిందూ యూనివర్సిటీ ప్రొ.ధీరేంద్రకుమార్‌రాయ్

రాయదుర్గం: మనదేశానికి అందం మన సాంప్రదాయాలేనని బనారస్ హిందూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ధీరేంద్రకుమార్‌రాయ్ పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మనూలో 'యోగా ఫర్ హ్యుమానిటీ' అనే అంశంపై సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సంప్రదాయాలతో బాటు యోగాను కూడా వదిలివేశామన్నారు. ఇప్పుడిప్పుడే దీనికి ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. హర్యానా కర్నాల్‌కు చెందిన యోగా గురువు డాక్టర్ సరితకుమార్ యోగా, సంగీతంపై అవగాహన కల్పించారు. యోగా, సంగీతం ఈ రెండింటి ద్వారా శ్వాసను నియంత్రించవచ్చన్నారు. మరో గురువు డాక్టర్ రష్మీ సింగ్ మాట్లాడుతూ యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, జీవన విధానమన్నారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వీసీ సయ్యద్ ఐనుల్ హసన్, స్కూల్ ఆఫ్ ఎంసీజే డీన్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్, డాక్టర్ అశ్విని, డాక్టర్ ఫిర్దోస్ తబస్సుమ్, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటింటికీ బీజేపీ భరోసా యాత్ర


కాలనీల్లో పాదయాత్ర చేస్తున్న బీజేపీ నేతలు


ప్రజల ఇంటికి వెళ్లి మాట్లాడుతున్న నాయకులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఇంటింటికీ బీజేపీ భరోసా యాత్రలో భాగంగా మంగళవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని రాజరాజేశ్వరీ నగర్, మోర్‌సూపర్ మార్కెట్, శివాలయం, గాయత్రి రెసిడెన్సీ వరకు కొనసాగింది. మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ. సూర్యారావు, రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యులు కన్నె ప్రకాశ్, వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, వడ్డేపల్లి శరణ్ కుమార్ చౌదరి శ్రీకర్‌రావు ఆధ్వర్యంలో గడగడపకు వెళ్లి కరపత్రాను పంపిణీ చేశారు. తొమ్మిదేళ్ల మోదీ ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. బీజేపీకి మద్దతు ఇచ్చి కమలం గుర్తుకు ఈసారి ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్‌గౌడ్, సత్యమూర్తి, రవికుమార్, శంకర్, ధర్మచౌదరి, అమర్‌గౌడ్, వెంకటేష్, లక్ష్మి, కార్తీక్, శశిరేఖ, శేఖర్, భగత్, శశికుమార్, లోకేష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'6 నెలలలోపు వాహనాలను తీసుకెళ్లాలి'

రాయదుర్గం: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్వాధీనం చేసుకున్న 1,197 వాహనాలను మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో ఉంచామని సైబరాబాద్ పోలీసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనాల వివరాలను వెబ్‌సైట్ www.cyberabad police.gov.in లో పొందుపరిచారు. ఇందులో మీ వాహనం ఉన్నట్లయితే సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓను కలిసి వాహనం డాక్యుమెంట్లను సమర్పించి తీసుకెళ్లాలని సూచించారు. 6 నెలల కాల పరిమితిలోపు సంప్రదించాలని, లేనట్లయితే ఆ వాహనాలను వేలం వేస్తామని సైబరాబాద్ పోలీసులు తెలిపారు. మరిన్ని వివరాలకు ఎంటీఓ ఎస్ విష్ణు సెల్ నంబర్ 9490617317లో సంప్రదించాలి.

పరిశోధన, ప్రచురణ నీతిపై వర్క్ షాప్

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్ (జీఎస్బీహెచ్)లో 'పరిశోధన, ప్రచురణ నీతి' అంశంపై రెండు రోజుల కార్యక్రమం ఈనెల 15, 16 తేదీలలో నిర్వహించనున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ రూపలత మంగళవారం తెలిపారు. తత్త్వశాస్త్రం, నీతి, శాస్త్రీయ నిర్వహణ, ప్రచురణ నీతి అంశాలపై తొలిరోజు, అందరికీ అందుబాటులో ఉండేలా ప్రచురించడం, ప్రచురణ దుష్ప్రవర్తన, డేటాబేసెస్, పరిశోధన కొలమానాలు అంశాలపై రెండోరోజు వక్తలు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు గీతం వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా డాక్టర్ జీఎస్పీ బాబును 812133 9990 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

టాలెంట్‌స్ప్రింట్‌కు 'ట్రైనింగ్ పార్ట్‌నర్ ఆఫ్ ది ఇయర్'

రాయదుర్గం: గచ్చిబౌలిలోని టాలెంట్‌స్ప్రింట్ సంస్థ 'ట్రైనింగ్ పార్ట్‌నర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకుంది. లాస్‌వెగాస్‌లో జరిగిన పెగా వరల్డ్ ఇన్‌స్పైయిర్ ఈవెంట్‌లో ఈ అవార్డును టాలెంట్ స్ప్రింట్ వ్యవస్థాపకులు, సీఈఓ, ఎండీ డాక్టర్ శంతనూపాల్, ఆపరేషన్స్ ఉపాధ్యక్షుడు రోహిత్ అగర్వాల్‌లు ఇటీవల లాస్‌వెగాస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులను పలువురు అభినందించారు.

అవయవదానం చేసి ఆదర్శంగా నిలిచి..

- మూసాపేట డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షుడు మల్లేష్‌యాదవ్ మృతి
- నివాళులర్పించిన పార్టీ నాయకులు, స్థానికులు



మోతీనగర్: బీజేపీ సీనియర్ నాయకుడు, మూసాపేట డివిజన్ ఉపాధ్యక్షుడు మల్లేష్‌యాదవ్ అనారోగ్యంతో మంగళవారం కన్నుమూశారు. అవయవదానం చేయాలనే సంకల్పంతో తన అవయవాలను దానం చేయాలని ఆయన కుటుంబీలకు తెలిపారు. తాను చనిపోతూ కూడా ఎదుటి వారి జీవితాల్లో వెలుగులు నింపే విధంగా ఆయన తీసుకున్న నిర్ణయాన్ని గౌరవించి మల్లేష్ అవయవదానానికి కుటుంబసభ్యులు అంగీకరించారు. వారి ఉదారతా భావానికి మూసాపేట కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మల్లేష్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అవయవదానంతో అనేక మంది వ్యక్తుల్లో మల్లేష్ యాదవ్‌ను చూసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ అవయవదానాన్ని అలవర్చుని తమ ఉదారతను చాటుకోవాలని సూచించారు.

లీకేజీకి మరమ్మతులు



కూకట్‌పల్లి సర్కిల్ ఆస్‌బెస్టాస్ కాలనీ కమాన్ వద్ద ప్రధాన రహదారిలో తాగునీటి పైప్‌లైన్ వాల్వ్ కొన్ని రోజులుగా లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. సోమవారం తాగునీరు రోడ్డుపాలు అని 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం పైపులైన్ వాల్వ్‌కు వాచర్స్ వేసి మరమ్మతులు చేశారు. దీంతో స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు. – ఆల్విన్‌కాలనీ

సాక్షి ఎఫెక్ట్..

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డినగర్ కాలనీకి చెందిన ప్రదీప్ అత్యవసర చికిత్స నిమిత్తం దరఖాస్తు చేసుకోగా మంజూరైన 2 లక్షల 50 వేల రూపాయలను మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ లబ్ధిదారుడి కుటుంబసభ్యులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం కొనసాగుతుందన్నారు. ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తంగా ఆదుకుంటోందని పేర్కొన్నారు. అనారోగ్యానికి గురై, ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలు, అభాగ్యులకు అండగా సీఎంఆర్‌ఎఫ్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అజీబ్‌బాయి, అక్బర్, తాయిర్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.


కల్యాణం.. కమనీయం

శ్రీ శ్రీనివాసుడి శుభయోగం









కేపీహెచ్‌బీకాలనీలోని రోడ్డు నం.4లోని వేంకటేశ్వరస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారి కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 6 గంటలకు తెప్పోత్సవం, ధ్వజారోహణ, ఊంజల్ సేవ నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఆలయానికి వెళ్లి పండితులకు పట్టు వస్త్రాలను అందజేశారు. – కూకట్‌పల్లి